
సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
శుక్రవారం 18-10-2024
సంపుటి: 20 సంచిక: 175
పేజీలు: 4 వెల: రూ.1

- 10 ప్రభుత్వ ట్యాంకులకు హక్కులిచ్చేసిన పెద్దలు
- గ్రామానికి ఇంత. వారికెంత?
- టీడీపీ-వైకాపా ఒక్కటైన వేళ
- ఎచ్చెర్లలో వెలుగులోకొచ్చిన దందా

రావయ్యా ముద్దుల మామా.. నీకు రాసిస్తా రాయలసీమ అని ఓ సినీకవి అంటే.. మనసా వాచా మనసిస్తే మైసూర్ ప్యాలెస్ రాసిస్తా అని మరో సినీకవి అన్నాడు. రాయలసీమ, మైసూల్ ప్యాలెస్‌లు ఎలా అయితే ఈ కవులవి కావో, తమవి కాని చెరువులను కూడా కొందరు పెద్దమనుషుల ముసుగులో రాసిచ్చేశారు. కొన్నాళ్లు గుట్టుగా దీన్ని ఉంచినా, కలెక్టర్ గ్రీవెన్స్‌లో రైతులు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..



# చెరువులు రాసిచ్చేశారోచ్!




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎచ్చెర్ల గ్రామం పరిధిలో ఉన్న 10 చెరువులను ఒక ప్రైవేట్ వ్యక్తికి రాసిచ్చేశారు. సార్వత్రిక ఎన్నికల ముందు వరకు ఒకరిపై మరొకరు పరస్పరం దాడులు చేసుకున్న వైకాపా, టీడీపీ నాయకులు ఎన్నికల తర్వాత ఒకే తాటిపైకి వచ్చారు. ఆ చెలిమిలో భాగంగానే ఏడాదికి రూ.లక్ష చొప్పున పదేళ్లకు రూ.10లక్షలకు అజ్జరాం పంచాయతీ ఎస్ఎస్ఆర్ పురానికి చెందిన దుంప తోటయ్యకు లీజుకు ఇచ్చేశారు. లీజు డీడ్‌లో మాత్రం ఐదేళ్లకు రూ.5లక్షలు, పదేళ్లపాటు లీజు కొనసాగిస్తామని చెప్పి డబ్బులు తీసుకున్నారు. రూ.20 జ్యుడీషియల్ స్టాంప్ పేపర్‌పై గ్రామానికి చెందిన 13 మంది తాజా, మాజీ స్థానిక సంస్థల ప్రతినిధులు సంతకాలు చేసి లీజ్‌డీడ్‌ను ఆగస్టు ఒకటిన రాయించారు. ఈ వ్యవహారం కొన్ని రోజుల వరకు వెలుగులోకి రాకుండా పెద్దలంతా జాగ్రత్తపడ్డారు. చెరువు గట్టులను లీజును దక్కించుకున్న దుంప తోటయ్య గట్టులను చదును చేసి నీలగిరి మొక్కలు వేయడంతో గ్రామంలో చర్చకు దారితీసింది. 2వేలకు పైగా జనాభా ఉన్న ఎచ్చెర్ల మండల కేంద్రంలో గ్రామంలో పెద్దమనుషులుగా చలామణి అవుతున్నవారి నిర్వాకంపై ఈ నెల 14న కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో గ్రామానికి చెందిన కేతింటి సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. గ్రామంలో పెద్దలు, స్థానికులు కలిసి చర్చించి గ్రామదేవత పండగలకు వినియోగించేందుకు ఈ లీజు మొత్తాన్ని వినియోగించనున్నట్టు లీజు డీడ్‌లో రాయించారు. లీజు డీడ్‌లో ఎచ్చెర్ల గ్రామం పరిధిలో ఉన్న చెరువుల పేర్లను ప్రస్తావించి, వాటిపై నీలగిరి మొక్కలు నాటుకునే వెసులుబాటు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ లీజు తంతు గ్రామ కార్యదర్శి, వీఆర్వోల సమక్షంలోనే సాగినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. రెవిన్యూ గ్రామ పరిధి సర్వే నెంబర్ 14లో సవిటి చెరువు, సర్వే నెంబర్ 35లో కొండవాని చెరువు, సర్వే నెంబర్ 54లో దాలోడు చెరువు, సర్వే నెంబర్ 35లో ధర్మాన చెరువు, సర్వే నెంబర్ 72లో అల్లువాని చెరువు, సర్వే నెంబర్ 102 రాళ్ల చెరువు, సర్వే నెంబర్ 123లో పల్లవాని చెరువు, సర్వే నెంబర్ 159లో ఎంకాలమ్మ చెరువు, సర్వే నెంబర్ 168లో వానోడు చెరువు, సర్వే నెంబర్ 177లో కొత్త చెరువు గట్టులను గ్రామ పెద్దల ముసుగులో కొందరు స్థానికులు లీజుకు ఇచ్చేశారు. లీజుకు తీసుకున్న తోటయ్య మొదటివిడతగా రూ.5లక్షలు చెల్లించి చెరువు గట్లను తన స్వాధీనంలోకి తీసుకొని చదునుచేసి నీలగిరి మొక్కలను నాటేశారు. నీలగిరి మొక్కలు పెంపకాలను వాణిజ్య సాగుగా గుర్తించడం వల్ల చెరువుగట్లపై పెంపకాలకు అనుమతి ఉండదు. దీనిపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన చెరువు ఆయకట్టు రైతులు చెరువు గట్లు ఎత్తు బాగా తగ్గిపోవడం, పూడిక పేరుకుపోవడం వల్ల చెరువుల్లో అంతంత మాత్రంగానే నీరు నిల్వ ఉందని కలెక్టర్‌కు వివరించారు. నీలగిరి మొక్కల పెంపకానికి ఎక్కువగా నీరు వినియోగించే అవకాశం ఉండడం వల్ల ఆయకట్టుకు సాగునీరందే అవకాశం కోల్పోతామని విన్నవించారు. వ్యవసాయ పనుల కోసం రాకపోకలు సాగించే వారిని చెరువుగట్టుపైకి అనుమతించడం లేదని, పశువులు, జీవాలను అడ్డుకుంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తక్షణమే నివేదిక ఇవ్వాలని ఎచ్చెర్ల తహసీల్దార్‌కు ఆదేశించారు. గ్రామ పెద్దల లీజు వ్యవహారంపై కలెక్టర్‌కు స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఎచ్చెర్ల తహసీల్దారుపై టీడీపీ, వైకాపా నాయకులు ఒత్తిడి పెంచి ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిలుపుదల చేయాలని గ్రామ పెద్దలు ప్రయత్నాలు ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యేను కలిసి కలెక్టర్‌తో మాట్లాడించి ఎటువంటి చర్యలు తీసుకోవద్దని కోరే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే

- మిగతా 4లో

# పిల్లల మనసెరగండి..!

లావణ్యకు నిండా పదమూడేళ్లు లేవు.. ఏడో తరగతి చదువుతుంది.. చిన్న బొద్దింకను చూస్తే పరుగుపెట్టి తల్లిని పట్టుకు ఏడ్చే వయసు.. ఎవరు లేని సమయంలో తన జడ రిబ్బన్‌తో హాస్టల్ గదిలో ఉన్న కిటికీ ఊచకు బిగించుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ రోజు పొద్దున్న పేపర్లలో రొటీన్ క్రైమ్ వార్తల్లో యథావిధిగా ఈ వార్త కూడా భాగమైపోయింది. ఓ సింగల్ కాలమ్ వార్త అంతే.. ఆ పసిపిల్లకు తనను తాను ఇలా చంపుకోవాలని ఎలా తెలిసిందో మరి.

**ఏడో తరగతి విద్యార్థిని ఆత్మహత్య**

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్లో విషాదం



సవర లావణ్య(ఫైల్)

పాతపట్నం: శ్రీకాకుళం జిల్లా పాతపట్నం రైల్వేస్టేషన్ సమీపంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్లో ఏడో తరగతి చదువుతున్న సవర లావణ్య(12) తన జెడ రిబ్బన్‌తో హాస్టల్ రూమ్‌లో కిటికీకి ఉరి

సినిమా అర్ధం చేసుకునే వయసు కాదు. హాస్టల్‌లో ఉంటుంది కాబట్టి సీరియల్ చూసే సమయం లేదు. పోనీ మొబైల్ ప్రభావమా అంటే అదీ కాదు. స్మార్ట్‌ఫోన్ కొనే స్తోమత లేని ఒక గిరిజన కుటుంబం. మరెలా ఈ పనికి సిద్ధపడింది. పెద్దలు మాట్లాడుతుండగా విన్నాదేమో. ఊర్లో ఎవరైనా ఇలా చేసుకున్నట్టు తెలిసిందేమో. ఏమో మరి.. పత్రికల్లో వచ్చిన దానిబట్టి ఆ చిట్టితల్లి హాస్టల్‌లో ఉండలేనని మారాం చేసింది. ఇంకా తన స్నేహితులెవరూ దసరాసెలవుల తర్వాత హాస్టల్‌కి రాలేదని, వారందరూ వచ్చాక హాస్టల్‌కి వస్తానని తల్లితో చెప్పింది.. ఏడ్చింది.. బతిమిలాడింది.. తల్లి అర్థం చేసుకోలేదు.. ఇక అర్థం చేసుకోనక్కర్లేదు. సరే ఇక్కడ ఆ తల్లి ఆ పిల్లను హాస్టల్‌లో వదిలి వెళ్లాలన్న నిర్ణయం వెనుక ఆర్థికపరమైన కారణాలు ఉండివుండవచ్చు. తన ఇంట్లో కంటే మంచి భోజనం ఇక్కడ చేస్తుందనో, మరోమారు ఇంటి నుంచి తీసుకురావడానికి ఆర్థిక స్తోమత చాలకో అయ్యుండొచ్చు. మరి అన్నీ ఉన్నవారి ఇళ్లల్లో పిల్లలు వేల సంఖ్యలో హాస్టళ్లలో అమ్మానాన్నలకు దూరంగా ఉన్నవారి సంగతి ఏంటి? పిల్లల్ని ఏ వయసులో హాస్టల్‌లో చేర్పించాలన్న విచక్షణ తల్లిదండ్రులకు లేకపోతే ఎలా? హాస్టల్‌లో కడుపునొప్పి అని ఏడ్చిన పిల్లలకు ఓ టాబ్లెట్ ఇస్తే సరిపోతుందని సర్దిచెప్పే వార్డెన్లు, అవి నమ్మి అక్కడే వారిని వదిలి వెళ్ళే పేరెంట్స్ గురించి ఏమనుకోవాలి. హఠాత్తుగా మనకి ఒక దుర్వార్త తెలిసినపుడు, మనకి నచ్చని పని చేయాల్సినప్పుడు మనకి కడుపులో తేడా అనిపించి విరేచనం అయ్యేలా ఉంటుంది. అంటే మనస్సుకి, పొట్టకి సంబంధం ఉంది. అలాగే మన పిల్లలు హాస్టల్‌లో కడుపులో నొప్పి అంటే అదొక మానసిక సమస్యగా అర్థం చేసుకోవాలి. అలా నొప్పి అన్న పిల్లల్ని ఇంటికి తెచ్చేసరికి చలాకిగా ఆడుకోవడం మనం చూస్తాం. పెద్దోళ్లు పలు రకాల పనుల్లోపడి హాస్టల్ ఉన్నవారి పిల్లలను మర్చిపోయే అవకాశం ఉంటుంది. కానీ చాలా సందర్భాల్లో పిల్లలు తోటి పిల్లలతో కలవలేక అమ్మ నాన్నలను మిస్ అయ్యామనే బెంగతో ఉంటారు. దీనివల్ల పిల్లల భవిత ఎలా ఉన్నా, తల్లి దండ్రుల ఆప్యాయతానురాగాలు లోపించి తర్వాత యాంత్రిక జీవనంలో జీవితం గడుపుతూ ఉంటారు.

పూర్తి కథనం కోసం https://www.satyamdaily.net/ లో చూడండి.

- సీహెచ్ దుర్గాప్రసాద్

# విలువలు.. విశ్వసనీయత.. కొత్తిమీరకట్ట



*విలువలు, విశ్వసనీయత. ఈ రెండు పదాలు బహుశా జగన్మోహన్ రెడ్డికి పంపింగ్ స్కీం పద్ధతిలో ఉపయోగపడతాయి. అసలు విలువలు అంటే ఏంటో, విశ్వసనీయత అంటే ఏంటో ఎంత ఆలోచించినా మనకు బోధపడవు. ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి బయటికి వచ్చేశాడట విలువల కోసం. అసలు బయటకు వచ్చేయడం దేనికి? నీ తండ్రి మరణించిన తర్వాత నీకు జన్మహక్కు లాగా ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేయాలని తలంచి, అలా చేయకపోతే కోపగించి బయటకు వచ్చేసావ్. అది విలువంటారా?*

కడప ప్రజలకు ఐదేళ్లు పార్లమెంటు సభ్యుడుగా సేవలందిస్తానని చెప్పి కదా మీరు పోటీ చేసింది? ఈ లోపులో అనుకోని అవాంతరం మీ తండ్రి మృత్యు రూపంలో ముంచుకొస్తే మీరు పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామా చేయటం, పార్టీలో ముసలం రేపటం ఏ రకం విలువల పాటింపు? పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామా చేసి రావటమే విలువని మీరు అనుకుంటున్నారు. అసలు రాజీనామా చేయడమే పరమ ఘోరమనే విషయం మీరు అంగీకరించరు. తండ్రి చనిపోతే అందులో రెండవసారి గెలిచి నెలల్లోనే ప్రమాదవశాత్తు మాయమైపోతే రాష్ట్రమంతా ఒక రకమైన సానుభూతి వాతావరణం పుట్టుకొస్తే దానిని క్యాష్ చేసుకోవడానికి మీరు లాభాన్ని ఆశించి మీ పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామా చేశారు. అసలు అలా రాజీనామా చేయడమే విలువలను మంట గలపటం. అది చంద్రబాబు వైస్రాయ్ ఘటనకు ఏమాత్రం తీసిపోదు. కాకపోతే ఆయన వెన్నుపోటుదారుడని ముద్ర వేయించుకున్నారు, మీరు విలువల కోసం అంటూ టముకు వేయించుకున్నారు. ఇద్దరి లక్ష్యం ఒకటే.. రాష్ట్ర ముఖ్యమంత్రిత్వం. అసలు లక్ష్యమే భారీ స్వలాభమైనప్పుడు ఇంకా విలువలు ఏంటంట? వాటి పాటింపేంటట?

ఒకపక్క రాష్ట్ర విభజన ఉద్యమం ముదిరి పాకాన పడినప్పుడు, కేసీఆర్ అనే వ్యక్తి తన స్కందారావాలతో అవకాశం కోసం పొంచి చూస్తున్నప్పుడు, ఆ బూచిని చూపించి మీరు అప్పటి మీ కేంద్ర నాయకత్వం మీద మైండ్‌గేమ్ ఆడదామని ప్రయత్నం చేశారు. కాకపోతే మొండిఘటాలకే నిజమైన మొండిఘటం సోనియా ముందు మీ ఆటలు సాగలేదు. తర్వాత రాష్ట్ర విభజన వగైరా వగైరా అనేక అవాంఛిత పరిణామాలు చోటుచేసుకుని రాష్ట్రం చింపి చాట అయింది.. అది వేరు. వేల కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యం వెంట ఉండడం, ఎదురుగా విశ్వసనీయత లేనివాడు అనబడే బలహీనమైన ప్రత్యర్థి ఉండటం, రాష్ట్రం రెండు కులాల గుప్పెట్లో చిక్కుకుని పోవటం, అప్పటిదాకా రాష్ట్రాన్ని ఏలిన జాతీయ పార్టీ కాస్త రాష్ట్ర విభజన చేసేసి ఆ మంటల్లో పడి కాలిపోవడం ఇన్ని అవకాశాల మధ్య ముఖ్యమంత్రి కావాలనే మీ ఏకైక లక్ష్యం కోసం దూరంగానైనా స్పష్టంగా కనబడుతున్న లక్ష్యాన్ని చేరుకోవటానికి అలా నడిచిపోవడం ఇవన్నీ చాలా సహజంగా జరిగిపోయాయి. విశ్వసనీయత అంటారా?

అమరావతిలో ఇల్లు కట్టి, రాజధానిని కేంద్ర ప్రభుత్వం డబ్బు ఇచ్చినా ఇవ్వకపోయినా సొంతంగా కట్టేస్తానని అని మీరు చెప్పిన మాట నిజం కాదా? చంద్రబాబు హయాంలో చిన్నాన్న హత్యకు ఎలా గురయ్యాడో సోదాహరణంగా వివరించిన మీరు తర్వాత అధికారంలోకి వచ్చి ఆ కేసు విషయంలో ఎంత విశ్వసనీయత పాటించారో జనం చూడలేదనుకుంటున్నారా? మీ పినతండ్రి హత్య కేసులో న్యాయం జరగాలని ఆయన కూతురు తన ఉద్యోగం వదిలేసి హైకోర్టు మెట్ల ముందు బికారిలా ఎలా తిరిగిందో జనం చూడలేదనుకుంటున్నారా?

అన్నట్టు మీ సంపూర్ణ మద్యనిషేధం ఏమైనట్టు? 151/175 సీట్లు మీకు ఇచ్చి వైరిపక్షాన్ని 23కు కుదించేసిన ఆంధ్ర ప్రజానీకం మీరు పాటించిన విలువలు, విశ్వసనీయతల తీరు చూశాక తిరిగి వాళ్లను 164/175 చేసేసి, మిమ్మల్ని 11కు కుదించేశాక మీరు ఇంకా అవే విలువలు విశ్వసనీయతలంటూ పదాలు వల్లెవేయటం హాస్యాస్పదం. మీ తీరును, మీ సజ్జల, మీ విజయసాయి, మీ రోజా, మీ కొడాలి, ఈ వంశీ వగైరా వగైరాలను, వారి తిట్లను చూసి జనంలో ఏనాడూ తెలుగుదేశం పార్టీ గుర్తు మీద ఓటు వేయని వాళ్లు కూడా చంద్రబాబు అధిపత్యంలోని పార్టీకి ఓటు వేయించిన ఘనత మీదేననే పరమ సత్యాన్ని మీరు గుర్తించాలి. మీరు పాటించిన విలువలు, విశ్వసనీయత వగైరాలు చూశాక జనం ఇచ్చిన తీర్పు ఇది. వాళ్లు పెనం నుంచి పొయ్యిలో పడితే అది వేరే విషయం. మీ పాలన అంత అద్భుతంగా సాగింది అనేది మీరు కూడా గుర్తుంచుకోవాలి. విలువలతో కూడిన రాజకీయంతో మీరు మీ పదవికి రాజీనామా చేశారా? అసలు రాజీనామా చేయడమే విలువల్ని తుంగలో తొక్కడం అనే సత్యం మీకు, మీ అంతేవాసులకు ఏనాటికి అర్థం కాదు. అన్నట్టు ఇప్పుడు మీతో ఉన్నది చంద్రబాబు ఇచ్చిన కొడాలి, వంశీ, రోజా, రజిని ఆ నలుగురే. పచ్చిగా చెప్పాలంటే చంద్రబాబు ఇచ్చిన బహుమతి అని అనాలి. వినేవాళ్ల వివేకాన్ని శంకించే ఈ మాటలు బాధాకరం. అంతే సార్.

- పెపకాయల రామకృష్ణ

**2019లో జగన్మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు 151 మంది ఎమ్మెల్యేలతో వైకాపా నిర్వహించిన వర్క్‌షాప్‌కి, గురువారం వైకాపా అధినేత జగన్ జిల్లా అధ్యక్షులతో ఇన్‌ఛార్జిలతో, అనుబంధ సంఘాలతో నిర్వహించిన వర్క్‌షాప్‌కు తేడా ఏమైనా ఉందా?** తేడా ఏమీ లేదు. అధికారంలో ఉన్నప్పుడు బైబిల్, ఖురాన్, భగవద్గీత మ్యానిఫెస్టో అంటూ వర్ణించడం, ప్రతిపక్షంలో ఉన్నా అవే పథకాలు వర్ణించడం. ఆ పథకాలు పెట్టిన మిమ్మలని నమ్మలేదు కాబట్టి చంద్రబాబుకు ఓటు వేశారు అనే నిజం జీర్ణించుకోలేకపోతే ఎలా? మీకంటే చంద్రబాబు పథకాలు ఎక్కువ ఇస్తానని చెప్పినప్పుడు ప్రజలు నమ్మి ఓట్లు వేశారు? మీరూ అవే పథకాలు పట్టుకొని ఉంటే ఎలా? కొంచెం అప్డేట్ అవ్వండి జగన్‌మోహన్‌రెడ్డి. పాత కాలం చింతపండును రోట్లో వేసి దంచినట్టు, మీ సంక్షేమ పథకాలు ఎత్తి పక్కన పెట్టండి. అవి మీకు దండగని ఎప్పుడు తెలుసుకుంటారో? రైతులు, ఉద్యోగులు, మందు బాబులు ఎందుకు ఓట్లు వేయలేదో ఆలోచించారా? టీడీపీ గెలిచాక కూడా మనం చేసిన మేలు ప్రజలకు తెలుసు అనుకుంటూ ఉంటే యుద్ధం చేయలేరు. యుద్ధం చేయడానికి మీ దగ్గర ఉన్న బలం ఏంటో.. బలహీనత ఏంటో తెలుసుకోండి. అసలు మీ బలం ప్రజలు అయితే.. మీ భజన కోటరీ దేనికి? భ్రమలో ఎందుకు ఉన్నారు? రియాలిటీలోకి రారా? ఓడిపోవడానికి ఈవీయం కారణం ఒకటే అనుకుంటే ఎలా? మీ ఓటమికి ఈవీయం కారణం కాదు. మీ వైఖరి, మీ భజన కోటరీ.. గెలిచాక ప్రజలను కలవకపోవడం, పార్టీని, కార్యకర్తలను గాలికి వదిలేయడం, నమ్మిన కార్యకర్తలను నట్టేట ముంచడం..వైయస్ లాగా నమ్మకం ఏర్పరచుకోలేకపోవడం..వైయస్ వేరు,జగన్ వేరు అని మీరే నిరూపించారు. సీఎం అయ్యాక పరదాలు కట్టి తిరగడం ఏంటి? మాస్ లీడర్ ఎవరు అయిన ప్రజలకు కనపడతారు. మీ పులివెందుల నియోజకవర్గంలో పరదాలు దేనికి? జగన్‌మోహన్ రెడ్డి మీరు ఏ మీటింగ్‌లో ఎవరినీ మాట్లాడనివ్వరు. మీరు చెప్పేది సోది అని మీ పార్టీ కార్యకర్తలు కూడా వినలేకపోతున్నారు. లీడర్ తక్కువ మాట్లాడాలి, ఎక్కువ వినాలి. ఎంతసేపు మీరు చెప్పేది ఏకపక్షంగా వినాలనుకుంటే ఎలా? నలుగురితో ఆఫీసులో కూర్చుని టీ తాగుతూ మాటాడితే నిజాలు బయటికి వస్తాయి. పార్టీ అనేది ఒక సమూహం.. పార్టీ అంటే జగన్,సజ్జలే కాదు. 40 శాతం ఓట్లు వేసిన ప్రజలది కూడా పార్టీలో భాగస్వామ్యం ఉంటుంది. 40 శాతం ఓటర్లకు అనుకూలంగా మీ విధానాలు ఉండాలి. వైకాపా అనేది వైయస్ రాజశేఖరరెడ్డి బలం, మీ బలం కాదు. మీ బలం 11 సీట్లు మాత్రమే.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి బలం 151సీట్లు. మీ పార్టీకి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆస్తి. వైఎస్ అనే ముద్ర లేకుండా ఎన్నికలకు వెళితే మీకు 11 సీట్లు ఇచ్చారని గుర్తు పెట్టుకోవాలి. నాది, నేనే, నేను చెప్పినట్టు అనే అహంకారం వదిలి.. మనది, మనం, మనందరం అనే మాటలు మాట్లాడితే బెటర్.. కొద్ది రోజులు పథకాల సోది ఆపి మిమ్మలని కలవడానికి వచ్చే పిచ్చి అభిమానులను కలవండి.. తాడేపల్లిలో ఖాళీగా ఉన్నా కలిసే ఓపిక లేకపోతే విజిటర్స్‌కి ఎలా లేదని బోర్డు పెట్టండి. ముందు మీలో ఉన్న నెగ్లజెన్సీ వదలండి.. ప్రతిపక్షంలో ఉంటే బాగా పని చెయ్యొచ్చు అని మీరే చెప్పారు. ముందు ఆ సూత్రం మీరు పాటించండి.. ముందు మీ పార్టీ కార్యకర్తలను కలవండి.. బిజీగా ఉన్నా అని సొల్లు చెబితే ఎవరూ వినరు. ప్రతిపక్షంలో బాగా పని చేయొచ్చని చెప్పిన మీరు ఆచరించి మళ్లీ సూక్తులు చెబితే బాగుంటుంది.. ముందు జగన్ తన వైఖరి మార్చుకోకుండా ఎన్ని వర్క్ షాపులు పెట్టినా వృథానే..!

- కిరణ్‌రెడ్డి


• ఎడిటోరియల్

## బీసీ నేతే దొరకలేదా జగనూ..?!

బీసీలు అధికంగా ఉన్న ఉత్తరాంధ్ర మీద రెడ్ల పెత్తనం మరి పోదేమో? సోషల్ ఇంజినీరింగ్‌లో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డికి కూడా ఉత్తరాంధ్రలో రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమించడానికి ఆ పార్టీ తరఫున ఒక బీసీ నేత దొరక్కపోవడం విడ్డూరం. మళ్లీ విజయసాయిరెడ్డిని తీసుకువచ్చి ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జిగా నియమించారు. ఆయన మీద ఆరోపణలున్నాయనే కదా ఎన్నికల ముందు ఆయన్ను ఇక్కడి నుంచి మార్చింది. మళ్లీ ఇప్పుడు ఆయన్నే తీసుకురావడం వెనుక ఆంతర్యాన్ని చూస్తుంటే వైఎస్ జగన్ మొండితనాన్ని వీడటం లేదనిపిస్తుంది. ఎవరేదైనా అనుకుంటారన్న స్పృహ లేదు. తాను అనుకున్నదే జరగాలనుకునే మనస్తత్వం. అది రాజకీయాల్లో పనికి రాదు. పట్టు విడుపులుండాలి. బయటకు కనిపించేది ఒకటి. లోపల జరిగేది ఒకటి రాజకీయంగా నిర్ణయాలు తీసుకోవాలి. కానీ జగన్ మాత్రం జనాలు ఏమనుకుంటారన్నది మాత్రం పట్టించుకునే పరిస్థితుల్లో లేరు. తాను అమలుచేసిన సంక్షేమ పథకాలే తనను తిరిగి అందలం ఎక్కిస్తాయని పిచ్చి కలలు కంటున్నట్లుంది. అందుకే జగన్ జగమొండిలా వ్యవహరిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు సరే.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా జగన్ తన తీరు మార్చుకోవడం లేదన్న విమర్శలు పార్టీ నుంచే వినిపిస్తున్నాయి. పార్టీలో ఆధిపత్యం ఎక్కువగా రెడ్లదే నడుస్తుంది. ఎందుకంటే ఎస్సీ నియోజకవర్గాలు కానీ, మిగిలిన నియోజకవర్గాల్లో వారు చెప్పినట్లు నడవాల్సిందే. జగన్ నోటి నుంచి వచ్చేది వేరు. జరిగేది వేరు. నా బీసీ, నా ఎస్సీ, నా ఎస్టీ, నా మైనారిటీ అంటూ నినాదం మాత్రమే జగన్ చేస్తారు. కానీ పెత్తనమంతా రెడ్లదే. రాయలసీమ రెడ్డి మనస్తత్వం, ఆ పోకడ జగన్‌కు పోయినట్లు లేదు. ఆయన ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా పనిచేశానని, ఇప్పుడు ఏపీ మొత్తానికి ప్రతిపక్షం అని తాను భావించడం లేదట్లుంది. తనకు నమ్మకమైన వాళ్లను పార్టీ పదవుల్లో నియమించాలని భావిస్తారు కానీ, ఆ ప్రభావం మిగిలిన సామాజిక వర్గాలపై పడుతుందని ఆయన ఊహించనూ లేకపోతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు కొన్ని సామాజిక వర్గాలను దగ్గరకు తీసుకుని మిగిలిన వారికి దూరమయ్యారు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక వర్గాన్ని దగ్గరకు తీసుకుని మిగిలిన సామాజికవర్గాలకు దూరమవుతున్నట్లే కనిపిస్తుంది. తాజాగా పార్టీకి జిల్లాలకు సమన్వయకర్తలను నియమించారు. అందరూ రెడ్లతో నింపేశారు. అందరూ తన బంధువులు, సన్నిహితులకే పదవులు కట్టబెట్టారు. ఉమ్మడిగుంటూరు, ప్రకాశం జిల్లాకు మిథున్‌రెడ్డి, ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉమ్మడి కృష్ణాజిల్లాకు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు బొత్స సత్యనారాయణ, ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం జిల్లాలకు విజయసాయిరెడ్డి, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలకు వైవీ సుబ్బారెడ్డిలను నియమించారు. ఆ బొత్స ఒక్కరే కాపు సామాజివకర్గం. మిగిలిన వాళ్లంతా రెడ్లే. గతంలో ఇదే తప్పు ఆయన చేశారు. వైకాపా అధినేత జగన్ మోహన్ రెడ్డికి ఘోర పరాజయం వచ్చాక రీజనల్ కో–ఆర్డినేటర్ల వ్యవస్థ రద్దు చేస్తారని భావించారు. జిల్లా అధ్యక్షులే కీలకం అని చెప్పారు. ఈ రీజనల్ కో ఆర్డినేటర్ల వ్యవస్థ వలన జిల్లా అధ్యక్షులకు,నియోజక వర్గ ఇంచార్జీలకు వైసీపీ అధినేతకు గ్యాప్ ఉంది కాబట్టి గత ఎన్నికలలో చిత్తు చిత్తుగా ఓడిపోయారు. ఇప్పుడు మళ్లీ రీజనల్ కో–ఆర్డినేటర్ల వ్యవస్థను తీసుకొచ్చారు. ఆయన చుట్టూ ఉండే వారికే బాధ్యతలు ఇస్తూ కొత్త జిల్లాలకు అవకాశం ఇచ్చారు. గతంలో కొనసాగిన సంప్రదాయం పాటించారు. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ల వ్యవస్థలో సోషల్ ఇంజనీరింగ్ పాటించలేదు. రెడ్లకు, తూర్పుకాపులకు మాత్రమే అవకాశం ఇచ్చారు. వైకాపా అధినేత జగన్ మోహన్‌రెడ్డి తన పని భారం తగ్గించుకొని గతంలో చెప్పినట్టు సాయిరెడ్డన్న చూస్తాడు.. తమ్ముడు మిథున్ రెడ్డి చూస్తాడు. అయోధ్యన్న చూస్తాడు. బాబాయి సుబ్బారెడ్డి చూస్తాడు. పెద్దన్న బొత్సా సత్యనారాయణ చూస్తాడు.. ప్రాంతాల వారీగా నియమించిన ఐదుగురు జగన్ మోహన్ రెడ్డికి కళ్లు, చెవులుగా పని చేస్తారు. వైకాపా అధినేత జగన్ మోహన్ రెడ్డిని నియోజకవర్గ ఇంఛార్జీలు కలవాలి అనుకుంటే వీరి అనుమతి లేకుండా కలిసే అవకాశం లేదు.. జగన్ మోహన్ రెడ్డికి ఆయా జిల్లాల పార్టీ పరిస్థితులు,పార్టీ అభివృద్ధికి,నియోజక వర్గాల వారీగా రీజనల్ కో ఆర్డినేటర్లు పార్టీ బాధ్యతలు పర్యవేక్షిస్తారు. రాష్ట్రం మొత్తం రెడ్లే ఉన్నట్టు జగన్మోహన్‌రెడ్డి అధికారం కోల్పోయిన తర్వాత కూడా భావిస్తున్నట్టుంది. ఎక్కడెలా ఉన్నా ఉత్తరాంధ్ర మాత్రం బీసీల కంచుకోట. ఇక్కడ నెల్లూరు రెడ్లను తెచ్చి ఆధిపత్యం చెలాయించడం వల్లే పార్టీ తుడిచి పెట్టుకుపోయింది. విజయసాయిరెడ్డి వర్గమని, సుబ్బారెడ్డి వర్గమని ఉమ్మడి మూడు జిల్లాలు మూడు ముక్కలు కావడంతో పార్టీ ఎక్కడా మూడు సీట్లు దక్కించుకోలేకపోయింది. ఇది తెలిసి కూడా జగన్ అదే తప్పు చేస్తుండటం ఆయన పట్టిన కుందేలుకు మూడేకాళ్లనిపించక మానదు.


## నగ్నంగా రాణిగారి గుర్రపుస్వారీ!

**అవును.. ఇది నమ్మశక్యం కాని చారిత్రిక నిజం. అధికార మదంతో ప్రజల్ని వేధించిన రాణుల్ని చూసాం. విలాసాల కోసం అధిక పన్నులతో వేపుకుని తిన్న రాజుల గురించి విన్నాం. అదే ప్రజల్ని కన్న బిడ్డల్లా పాలించిన ప్రభువుల గురించి కూడా చదివాం. అయితే, ప్రజల నెత్తిన పన్నుల భారం తగ్గించాలంటూ నగ్నంగా నడివీధికి వచ్చిన రాణి గురించి విన్నారా..?**



ఆ రాణి పేరు లేడీ గోడివా. 11వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లోని మెర్సియా ప్రాంత పాలకుడిగా ఉండిన లియోఫ్రిక్ భార్య ఈమె. క్రిస్టియన్ మిషనరీలను ప్రోత్సహిస్తూ స్థలాలు విరివిగా దానం చేసేది. రాజధాని కోవెంట్రీ నగరంలో పన్నులు విపరీతంగా ఉండేవి. ప్రజలు ఈ అధిక పన్నులను చెల్లించలేకపోతున్నారనీ, సరళతరం చేస్తూ డిక్రీ ఇవ్వాలని భర్త లియోఫ్రిక్‌ను కోరుతూ వచ్చింది. ఒకరోజు సభలో పన్నుల విషయమై గుచ్చి గుచ్చి అడిగి ఒత్తిడి చేసింది. దీంతో 'నువ్వు నగ్నంగా నడి వీధిలోకి వస్తే నేను పన్నులు తగ్గిస్తూ డిక్రీ ఇస్తా' అన్నాడు. ఇందుకు ఆమె కూడా సరే అని ఒప్పుకుని ఒక షరతు విధించింది. 'బజారులో ఏ ఒక్కరినీ లేకుండా చేస్తే నేను గుర్రంపై నగ్నంగా సవారీ చేస్తా' అంటూ. ఇది సభలో జరిగిన వాగ్వాదం కాబట్టి ఈ సవాల్ నుంచి ఆమె భర్త వెనకడుగు వేసే అవకాశం లేకుండా పోయింది.

ఆ రోజు రానే వచ్చింది. రాణి గోడివా తన ఒత్తయిన జుట్టుని ఆచ్ఛాదన చేసుకుని పేలస్ నుంచి నగ్నంగా బయటకు వచ్చింది. తన అశ్వాన్ని ఎక్కి మార్కెట్ వీధిలో తిరిగి భవనం చేరుకుంది. రాజప్రసాదానికి చెందిన ఇద్దరు మహిళలు మాత్రమే ఆమెను అనుసరించారు. రాణి నగ్నపర్యటన ముగిసింది. ఇచ్చిన మాట మేరకు పన్నులు ఉపసంహరించబడ్డాయి. దీంతో లేడీ గోడివా పేరు ఇంగ్లాండ్‌లో మార్మోగిపోయింది.




ఆ విధంగా ఆమె చరిత్ర కెక్కింది. ఆ కోవెంట్రీలోనే కాదు.. ఇంగ్లాండ్‌లో చాలాచోట్ల ఆమె శిలా విగ్రహాలు దర్శనం ఇస్తాయి.

పీపింగ్ టామ్ అంటే ఎవరు..? లేడీ గోడివా కథతోనే ముడిపడిన పీపింగ్ టామ్ గురించి కూడా తెలుసుకుందాం. రాణి నగ్నంగా వీధిలోకి వచ్చే సమయం గురించి నగరంలో ముందే అనౌన్స్ చేయడం జరిగింది. ఆ సమయంలో ప్రజలందరూ ఇళ్లకే పరిమితం అవ్వాలనీ, ప్రతి ఇంటి తలుపులు, కిటికీలు మూసి ఉంచాలని ఆదేశాలు జారీ చేయబడ్డాయి. అయితే టామ్ అనే ఒక టైలర్ మాత్రం కొద్దిగా కిటికీ తెరిచి రాణి అందాలు చూసాడట. ఇది బయటకు పొక్కడంతో అతడిని బంధించి ఉరి తీశారట. అప్పటి నుంచి ఈ విధంగా దొంగచాటుగా వేడుక చూసే వారిని పీపింగ్ టామ్ అని పిలవడం పరిపాటి అయిపోయింది. అన్నట్లు ఇంకో ముఖ్య విషయం ఏమంటే.. ఈ కోవెంట్రీ ప్రాంతంలో ప్రతి ఏటా జులై నెలలో 3 రోజుల పాటు ఆమె పేరిట 'గోడివా ఫెస్టివల్' జరుగుతుంది. దీన్ని తిలకించేందుకు దేశ విదేశాల నుంచి లక్షకు పైగా వీక్షకులు వస్తారు. ఈ కథ చదివి మా కర్నూల్ మంగమ్మవ్వను పోల్చుకునేరు సుమా..!



**- కాశీపురం ప్రభాకర్‌రెడ్డి**




## ఎలిమెంట్ దొరికితే చాలు..

# తెరకెక్కించాల్సిందే!

**తల్లిలేని జింక పిల్లలకు చనుబాలిచ్చే స్త్రీలున్న బిష్ణోయీ సమాజంలో పుట్టిన లారెన్స్ బిష్ణోయీ! రాంగోపాల్ వర్మ సిన్మా తీస్తాడట! జింక పిల్ల తల్లి మరణిస్తే.. ఆ పిల్లను బిష్ణోయీ మహిళ తన చాతి దగ్గరకు తీసుకుని పాలు ఇస్తుంది. పిల్లలకు ఆవుపాలు తాగించి పెంచే మన సమాజంలో ఇది వింత. ఇలాంటి దృశ్యం మనకు ప్రపంచంలో ఎక్కడా కనిపించదు. కిందటేడాది భారత నటుడు వివేక్ ఓబెరాయ్ దుబాయిలో ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ బిష్ణోయీ సమాజం గురించి చెప్పిన మాటలివి. (ముంబైలో మొన్న ఎన్సీపీ నేత బాబా సిద్దిఖీ బిష్ణోయీ గ్యాంగ్‌స్టర్ లారెన్స్ ముఠా పంపిన షార్ప్‌షూటర్ల చేతుల్లో హతమైనప్పటి నుంచి ఈ వీడియో వైరలవుతోంది)**

నిజమే, రాజస్తాన్‌లో తమ ప్రాణాలు ఒడ్డి మరీ చెట్లను సంరక్షిస్తూ పశుపక్ష్యాదులను కాపాడే జాతిగా బిష్ణోయీలకు మంచి పేరుంది. రాజస్థాన్ తర్వాత తక్కువ సంఖ్యలో వారు హరియాణా, పంజాబ్‌లో నివసిస్తున్నారు. కర్ణాటక లింగాయతుల మాదిరిగానే అనేక కులాల సంగమంతో ఏర్పడిన జాతి బిష్ణోయీలు. మూడు రాష్ట్రాల్లో ఓబీసీ జాబితాల్లో ఉన్న బిష్ణోయీలు 'ప్రకటిత' శాఖాహారులు. 1979లో హరియాణా ముఖ్యమంత్రిగా (జనతాపార్టీ తరఫున) చౌధరీ (ఇది గౌరవనామం మాత్రమే) భజన్‌లాల్ ప్రమాణం చేసే వరకూ దక్షిణాది ప్రజలకు ఉత్తరాదిన బిష్ణోయి అనే కులం ఉందనే సంగతే తెలియదు. విశేషం ఏమంటే.. భజన్‌లాల్ సీఎం అయ్యేనాటికి (45 సవంత్సరాల క్రితం) 90మంది సభ్యులున్న హరియాణా అసెంబ్లీలో ఒకే ఒక్క బిష్ణోయీ ఎమ్మెల్యే భజన్‌లాల్. అప్పుడు రాష్ట్రంలో బిష్ణోయీల జనాభా కేవలం లక్ష మాత్రమే. తెలుగు రాష్ట్రాల్లో మాదిరిగానే కుల స్పృహ–చైతన్యం కాస్త ఎక్కువే ఉన్న హరియాణాలో ఇలా ఏకైక బిష్ణోయీ ఎమ్మెల్యే ముఖ్యమంత్రి కావడం దివంగత ప్రధాని పీవీ నరసింహారావు గారి మాటల్లో చెప్పాలంటే 'ప్రజాస్వామ్య అద్భుతం'. వాస్తవానికి బిష్ణోయీ సాంప్రదాయ స్థాపకుడు గురూ జంబేశ్వర్ రాజస్థాన్‌కు చెందినవాడైనప్పటికీ ఈ ఎడారి రాష్ట్రానికి చెందిన (రాజస్తానీ) బిష్ణోయీ ఎవరూ నాడు భజన్‌లాల్, నేడు పంజాబీ బిష్ణోయీ గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయీ మాదిరిగా పేరుప్రతిష్టలు సంపాదించలేదు. పేరులో లారెన్స్ ఉన్నా ఈ 31 ఏళ్ల బాహుబలి హిందువే.

బిష్ణోయీల జనాభా తక్కువేగాని వారి జీవకారుణ్య సిద్ధాంతాలు ప్రపంచ ప్రజల గుర్తింపు పొందాయి 20వ శతాబ్దం చివర్లో. హిమాలయ ప్రాంతాల్లో (ఉత్తరాఖండ్, హిమాచల్ రాష్ట్రాలు) చెట్లను కాపాడాలనే లక్ష్యంతో దీర్ఘకాల ఉద్యమం 'చిప్కో' నడిపిన గాంధేయ ఉత్తరాఖండీ బ్రాహ్మణుడు సుందర్ లాల్ బహుగుణకు స్ఫూర్తి, ఆదర్శం కూడా రాజస్తానీ బిష్ణోయీలే. అయితే, రాజస్తాన్‌లో కృష్ణజింకను వేటాడి, సల్మాన్ ఖాన్ 'పాపం' చేసేనాటికి ఐదేళ్ల బాలుడైన లారెన్స్ బిష్ణోయీలో అందుకు 'కండలవీరుడు' సల్లూభాయ్‌పై పగ రగలడం నిజంగా దైవికంగా ఉందని సినీ దర్శకుడు పి.రాంగోపాల్ వర్మ నిన్న ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించడం విశేషం. తాను ఇకముందు సినిమా తీయడానికి లారెన్స్ జీవితం చాలా అనుకూలంగా ఉందని కూడా వర్మ చెప్పారు. ఇప్పటివరకూ అంతర్జాతీయస్థాయిలో మహారాష్ట్రకు చెందిన కొంకణీ ముస్లిం దావూద్ ఇబ్రాహీం కస్కర్ అంతర్జాతీయ గ్యాంగ్‌స్టర్‌గా గుర్తింపు సంపాదిస్తే, అతనికి ఒక మోస్తరు పోటీదారుగా ఎదిగి పతనమైన చోటా రాజన్ అనే మరో గ్యాంగ్‌స్టర్ కూడా ఆగ్నేయాసియా ప్రాంతంలో (థాయిలాండ్ బ్యాంకాక్) తన నేర కార్యకలాపాలతో కొన్నాళ్లు పేరుమోగి పోయాడు. ఇంటర్నేషనల్ గ్యాంగ్ స్టర్‌గా సర్కారు సాయంతో ఎదిగిన రాజేంద్ర నికాల్జే అనే చోటా రాజన్ పారిశుద్ధ్య పనిచేసే దళితకులంలో పుట్టాడు. ఇప్పుడు ఉత్తరాది ఓబీసీ అయిన లారెన్స్ బిష్ణోయీ కెనడాలో కూడా తన గ్యాంగ్‌తో నేర కార్యక్రమాలు నిర్వహిస్తూ అంతర్జాతీయ గ్యాంగ్‌స్టర్‌గా పేరు సంపాదించడంతో ఈ అవాంఛనీయ వృత్తిలో బిష్ణోయీలకు భాగస్వామ్యం ఉందనే కీర్తి తీసుకురావడం గొప్ప విజయం. 20వ శతాబ్దం ఆరంభం నుంచే ఉత్తరాది, హిందీ రాష్ట్రాల్లో బడాబడా నేరాలు చేసే ముఠాలను నడిపే 'బాహుబలులు'గా, గ్యాంగస్టర్లుగా పేరుమోసిన అనేక మంది బ్రాహ్మణులు భారత నేర ప్రపంచంలోనూ ఇలా కొద్దికొద్దిగా తమ గుత్తాధిపత్యం కోల్పోతున్నారు.

**- మేరుగుమాల నాంచారయ్య**

### బిష్ణోయీల పండగ ఆశ్వయిజ అమావాస్య వల్ల హరియాణా పోలింగ్ తేదీ మార్పు

**కిందటి నెల బిష్ణోయీల పూజ్య గురువు జంబేశ్వర్ స్మృత్యర్థం అక్టోబర్ ఒకటిన జరిపే పర్వదినం ఆశ్వయిజ అమావాస్య కారణంగా హరియాణా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను అక్టోబర్ 5కు వాయిదా వేసింది ఎన్నికల కమిషన్. ఆ రోజు రాజస్థాన్ సందర్శించే హరియాణివీ బిష్ణోయీల ఓటు హక్కును కాపాడడానికి ఇలా పోలింగ్ తేదీ ముందుకు జరిపామని సర్కారు ప్రకటించింది. అయినా కాంగ్రెస్ ఈ నిర్ణయంపై విరుచుకుపడింది.**

## వింటర్ స్టైల్‌లో అదరగొట్టింది!!



స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న సోషల్ మీడియాలో తన గ్లామర్‌తో ఎప్పటికప్పుడు హాట్ టాపిక్‌గా నిలుస్తూ ఉంటుంది. రీసెంట్‌గా ఆమె చేసిన ఫోటోషూట్ మరో సారి అందర్నీ ఆకట్టుకుంది. రష్మిక తన ఇన్‌స్టాగ్రామ్‌లో Onitsuka Tiger Autumn Winter 2024 కలెక్షన్‌ను ప్రదర్శిస్తూ కొన్ని అద్భుతమైన ఫోటోలను పోస్ట్ చేసింది. ఈ ఫోటోలలో రష్మిక నగర వాతావరణంలో వింటర్ వేర్‌ను సరిగ్గా ప్రదర్శిస్తూ స్టన్నింగ్ లుక్స్‌లో కనిపిస్తోంది.

ఫోటోషూట్‌లో భాగంగా, రష్మిక టాప్ నాట్‌లో జుట్టు సర్దుకుని, చలికాలం ఫ్యాషన్ అవుట్‌ఫిట్స్‌లో దర్శనమిచ్చింది. ఒక ఫోటోలో బ్లాక్ జాకెట్ ధరించి, ఆకర్షణీయమైన పోజ్‌లో నిలబడిన రష్మిక ఆ లుక్‌కి మరో సొగసును తీసుకొచ్చింది. మరో ఫోటోలో ఆమె పర్ఫెక్ట్ టోన్ మేకప్‌తో సహజత్వం కనబరిచింది. రష్మిక తన ఫ్యాషన్ సెన్స్‌తో మామూలుగా ఉండదు అని మరోసారి ప్రూవ్ చేసింది. రష్మిక సినిమాల విషయానికొస్తే, ప్రస్తుతం ఆమె చేతి నిండా పలు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. బాలీవుడ్‌లో విక్కీ కౌశల్ సరసన 'చావా' సినిమాలో నటిస్తోంది. అదే విధంగా, శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కుబేర' అనే సినిమాతో బిజీగా ఉంది. వీటితో పాటు 'గర్ల్‌ఫ్రెండ్' మూవీలో దీక్షిత్ శెట్టితో స్క్రీన్ షేర్ చేసుకుంటోంది. ఇవి కాకుండా, టాలీవుడ్‌లో అద్భుతమైన విజయం సాధించిన 'పుష్ప' సీక్వెల్ 'పుష్ప 2' లో శ్రీవల్లిగా రష్మిక మరోసారి అలరించనుంది.

రష్మిక కెరీర్‌లో మొదటగా కన్నడ సినిమాలతో నటన మొదలు పెట్టినా, తెలుగులో ఆమెకు వచ్చిన గుర్తింపు అంతా ఇంతా కాదు. 'గీత గోవిందం,' 'సరిలేరు నీకెవ్వరు' వంటి సినిమాలతో ఆమె టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా మారింది. ఇప్పుడు నార్త్ ఇండియా వరకు తన సత్తా చాటుకుంటూ పాన్ ఇండియా స్టార్‌గా ఎదుగుతోంది. రష్మిక అందం, అభినయం మాత్రమే కాదు, ఆమె ఫ్యాషన్ సెన్స్ కూడా ప్రతిసారీ హైలైట్ అవుతూ ఉంటుంది.

**– తుపాకి.కామ్ సౌజన్యంతో...**



# గాలికి గమకం నేర్పిన వేణు నాదముని!

ఓ ఫైన్ మార్నింగ్.. చక్రవాకం, భాగీశ్వరీ కలిసి వాకింగ్ చేస్తున్నాయి. మధ్యలో కనిపించిన ఇళయరాజాను చూసి ఇట్టే ఆకర్షితులై మోహంలో పడ్డాయి. ఆ మోహాన్ని కాదనలేని మొహమాటంతో రాజా.. మరిన్ని రాగఛాయలద్దాడు. ఆ వేకువ జాముకో పాట వినిపించాడు. నిత్యం ఉదయాన్ని చూస్తూనే ఉన్నా.. ఉదయమంటే ఇదీ అనే రీతిలో ఆ పాట విన్న మణి.. పీసీ శ్రీరామ్ అనే థర్డ్ ఐతో దాన్ని తెరకెక్కించాడు. టీవీలు ఎంట్రీ ఇవ్వని కాలంలో జనరంజనిలో రేడియోలో అలరిం చిందా పాట. ఆ తర్వాత నిత్యం మన ఇళ్లల్లో టీవీల్లో చూస్తూ, వింటున్నప్పుడు అందమైన విజువల్ ఫీస్ట్‌తో ఉదయాన్ని మరింత అందంగా చూపించిందాపాట. ఆమనీ పాడవే హాయిగా అంటూ సాగిన ఆ వేటూరీ గీతానికి రాజా స్వరకల్పన, శ్రీరామ్ సినిమాటోగ్రఫీ, మణిరత్నం దర్శకత్వం, బాలూ గానం వెరసి ఆ పాట హిట్టనుకుంటే.. ఆ పాట చిత్రీకర ణతోనే ఊటీ పర్యాటకం మరింత పెరిగిందనుకోవచ్చు. అయితే, ఇంకొక్క బాకీనీ మనం చెప్పుకుని తీరాలి. ఆ విశేషమే.. ఎవరబ్బా అనిపించేలా వేణునాదాన్ని వినిపించిన ఫ్లూటిస్ట్ నేమ్. అదే ఇళయరాజా నచ్చి, మెచ్చిన అరుణ్ మొళి అనే ప్రఖ్యాత వేణునాద వాద్య కారుడి మురళీ సంతకం.

**ఒరే ముర్రై ఉన్ దర్శనం..**

ఆ తమిళ పాట ఇంటర్ నోట్స్ గమనిస్తే.. అరుణ్ మొళి అలియాస్ నెపోలియన్ సెల్వరాజ్ ప్రతిభ అర్థం చేసుకోవచ్చు. సినీ సంగీతంలో ఇప్పుడు ఏ.ఆర్.రెహమాన్ దగ్గర ఉన్న ఫ్లూటిస్ట్, కంపోజరైన నవీన్ పేరు బాగా ప్రాచుర్యంరలోకి ఎలాగైతే వచ్చిందో.. ఆ స్థాయి పిల్లనగ్రోవి వాద్యకారుడైన నెపోలియన్ పేరు చెప్పుకోకుంటే.. సినీ సంగీత ఆర్కెస్ట్రైజేషన్ సంపూర్ణం కాదు.

ఫ్లూటిస్ట్ అంటే కేవలం సంగీత దర్శకుడిచ్చే నొటేషన్స్ మాత్రమే ఫాలో అవ్వడం కాదు.. వాటికి మరింత మెరుపులు, చమకులు అద్దే మనోధర్మాన్నెరిగి ఉండాలి. పాటకు ప్రాణం పోయాలి. జీవం ఉట్టిపడాలి. విన్నకొద్దీ వినేలా చేయాలి. అది అరుణ్ మొళి అనే ఓ ఫ్లూటిస్ట్‌ను తన ట్రూప్‌లోకి ఎంపిక చేయడంతో నిజం చేయగలిగారు ఇళయరాజా.

పై చదువుల కోసం మద్రాస్ బస్సెక్కి.. మార్గమధ్యంలో సర్టిఫికెట్స్ పోగొట్టుకుని సినిమా సంగీతంలో నంబర్ వన్ ఫ్లూటిస్ట్‌గా పేరుగాంచిన వేణువాద్యకారుడు అరుణ్ మొళి. ఉయరంద ఉల్లమ్ అనే సినిమాలో వాంతమ్ మహాలక్ష్మి అనే పాటకు ఇళయరాజా వద్ద మొట్టమొదట ఇతర ఫ్లూటిస్ట్‌లతో కలిసి చెన్నై ప్రసాద్ స్టూడియోలో భాగస్వామయ్యాడు. ఆ తర్వాత అరుణ్ మొళి ఉరఫ్ నెపోలియన్ ప్రతిభకు ముగ్ధుడైన రాజా.. తన ట్రూప్‌లో చేరిపొమ్మన్నాడు. అలా 1984వ సంవత్సరం నెపోలియన్ అనే ఓ ఫ్లూటిస్ట్ తమిళ చిత్రసీమలో పాపులర్ వేణునాద వాద్యకారుడిగా వడివడిగా ఎదిగేందుకు అడుగులు పడ్డాయి.

అయితే, కేవలం అరుణ్ మొళి ఫ్లూటిస్ట్‌గానే కాకుండా నేపథ్య గాయకుడిగా కూడా సుపరిచితుడు. ఇళయరాజాతో పాటు.. దేవా, కార్తీక్ రాజా, సిర్పి, ఎస్.ఏ. రాజ్‌కుమార్, శంకర్ గణేషన్, యువన్ శంకర్ రాజా, హారిస్ జైరాజ్, శివ, మాస, దిన, విద్యాసాగర్, సౌందర్యన్.. ఇలా ఎందరి వద్దో నేపథ్యగానంతోనూ.. తన వేణునాదమంత వండర్స్ చేశాడు. అయితే, ఇళయరాజా ఆస్థాన విద్వాంసుడిగా చేరాకే శంకులో పడ్డ తీర్థంలాగా నెపోలియన్ తన ప్రతిభకు మరింత సాన బెట్టే అవకాశం దక్కింది. చాలాకాలం క్లబ్బుల్లో, ఇతర ఆర్కెస్ట్రాల్లో సెల్ఫ్ మేడ్ ఫ్లూటిస్ట్‌గా ప్రోగ్రామ్స్ చేసుకున్న నెపోలియన్ సినిమా ఎంట్రీ.. 1980వ దశకంలో శంకర్స్మ అనే మళయాళ మూవీతో.. శంకర్ గణేషన్ అనే సంగీత దర్శకుల వద్ద ప్రారంభమైంది.

స్కూల్ ఎడ్యుకేషన్ తర్వాత ఓ ఫార్మాసెట్యుకల్ కంపెనీలో వర్కింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి.. ఓ అద్భుతమైన వేణు నాద కళాకారుడిగా ఎదుగుతాడని అసలు ఆ అరుణ్ మొళే అనుకోలేదేమో బహుశా. పాడు నిలవే అనే తమిళ సినిమాలో మలైయోరుమ్ వీసుమ్ కాటు.. అలాగే సెమీ క్లాసికల్ రీతిలో వినిపించే పల్లవియే శరణమ్ అనే పాటలకు వాయించిన పిల్లనగ్రోవి వాద్యం ఆయన ప్రతిభను సినీ బాహ్య ప్రపంచానికి చాటింది. 1984లో ఎన్ జీవన్ పాడుతూ అనే సినిమాలోని ఓరె ముర్రై ఉన్ దర్శనమ్ అనే పాట.. మిగతా ఫ్లూటిస్టులతో పోలిస్తే నెపోలియన్ ఎందుకు బెటర్ అండ్ బెస్టో సినీ సంగీత ప్రపంచానికి తెలియజెప్పింది. అలా ఆ పాటతో నెపోలియన్ ఇళయరాజా ఎక్స్ క్లూజివ్ ఫ్లూటిస్ట్‌గా మారిపోయారు. వన్న వన్న పోక్కల్‌లోని కే.జే.యేసుదాసు ఆలపించిన ఇల నెంజేవా, గోపుర వాసలిలేలో ఎస్.జానకీ పాడిన తాలాత్రూ పుంగాట్రు, సత్య సినిమాలోని వలై ఓసై గలగల అంటూ.. తెలుగులో పరువాలు కనివిని ఎరుగని చెరగని తరగని కవితలు పలికే అంటూ వినిపించిన ఏ పాటలోనైనా ఇళయరాజా మ్యూజికల్ ఇంటర్ నోట్స్.. ఆ ట్యూనింగ్స్ ఎంతగా అలరిస్తాయో..వాటికి తన ఫ్లూట్ తో అంత ప్రాణం పోశాడు నెపోలియన్.

**ఓ ఫ్లూటిస్టే కాదు..**

సూర సంహారం సినిమాలో చిత్రతో కలిసి నాన్ ఎంబదో నీ ఎల్లవో వంటి పాటను అరుణ్ మొళి నేపథ్యగాయకుడిగా పాడిన తీరు ఓ ప్రొఫెషనల్ సింగర్ స్థాయి ఏ విధంగా ఉండాలో చెబుతుంది. పున్నై వన పూంగుయిలే, వాసాకరు వేపిలయే, వెన్నెలవుక్కు వానత పుడిక్కలయ, వెళ్లి కొలుసు మణి వంటి పాటలెన్నో నేపథ్య గాయకుడిగా తన ఫ్లూట్ వాద్యంతో పోటీ పడేలా పాడటం అరుణ్ మొళి ఉరఫ్ నెపోలియన్ ప్రత్యేకత. కార్తీక్ రాజా సంగీత దర్శకత్వం వహించిన ఎనక్కోర్ మగన్ పిరప్పన్ సినిమాతో పాటు విద్యాసాగర్ అనే ప్రతిభావంతమైన మరో అద్భుత సంగీత దర్శకుడు కంపోజ్ చేసిన వన్ ఆఫ్ ద మోస్ట్ అండర్ రేటెడ్ అరసియాల్ అనే సినిమాలోని పాటల గీత రచయితగా కూడా నెపోలియన్ బహుముఖ ప్రజ్ఞ సినీ సంగీతంలో చెప్పుకోవాల్సింది.

**ఏ శ్వాసలో చేరితే గాలి గాంధర్వమవుతున్నదో అన్న ఓ సినీకవి అక్షరరూపానికి.. ప్రతిబింబాన్ని వెతికితే.. ఆ నిలువెత్తు రూపం నెపోలియన్ సెల్వరాజ్ అలియాస్ అరుణ్ మొళి.**

- రమణ కొంటికర్ల

## హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభం కానున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు సంబంధించిన 18వ బ్యాచ్‌లో చేరడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.విజయకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైట్ వెహికల్ లైసెన్స్, ఒక సంవత్సరం అనుభవం కలిగి 21 సంవత్సరాలు నిండినవారు ఈ హెవీ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్‌కు అర్హులన్నారు. శిక్షణ 40 రోజుల పాటు వుంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకావాలని సూచించారు. వివరాలకు 8074640792, 7382923293 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

## మౌన ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ, రోజస్, మూమెంట్ గ్లోబల్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 19న ఉదయం ఏడు గంటలకు ఆర్ట్స్ కళాశాల నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు వాక్ ఫర్ ఫ్రీడమ్ మానవ అక్రమ రవాణా గురించి నిర్వహించబోవు మౌనర్యాలీ కార్యక్రమ పోస్టర్లను ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి సుధ, విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కవిత, రోజస్ సంస్థ అధ్యక్షుడు జీవీ నాగభూషణరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, శాసపు జోగి నాయుడు, బీవీ రవిశంకర్, జి.లక్ష్మీ, గుడ్ల జగ్గారావు, డాక్టర్ ఎం.వాసుదేవ్, జి.వాసుదేవ రావు, ఎం.మల్లిబాబు, నల్లబాటి కృష్ణమూర్తి, వూన్న నాగభూషణరావు, పట్నాన రామారావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని ఆత్మహత్యపై సత్వర నివేదిక అందించండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)



పాతపట్నం రైల్వేస్టేషన్ సమీపంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్లో ఏడో తరగతి చదువుతున్న 12 ఏళ్ల విద్యార్థిని హాస్టల్ రూమ్‌లో తన జడరిబ్బన్‌తో ఆత్మహత్యకు పాల్పడ్డ ఉదంతంపై జిల్లా విద్యాశాఖాధికారులు, ఐటీడీఏ అధి కారులు సమగ్ర దర్యాప్తు చేపట్టి సత్వర నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేసినట్టు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఈమేర కు శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ దసరా సెలవుల అనంతరం స్కూల్‌కి చేరుకున్న విద్యార్థిని మృతికి ఉపాధ్యాయుల వేధింపులు ఏవైనా ఉన్నాయా, ఆత్మహత్యకు పాల్పడిన అనంతరం తుది ప్రయత్నంగా స్కూల్ అధికారులు ఆసుపత్రికి తీసుకెళ్లడంలో ఆలస్యం ఏదైనా జరిగిందా, ఆసుపత్రి సిబ్బంది అందించిన వైద్యసేవలపై పూర్తి వివరాలు అందించాలని సూచించారు. అధికారులు సమర్పించే నివేదిక ఆధారంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో కమిషన్ చర్యలకు ఉపక్రమించనున్నట్టు సీతారాం తెలిపారు.

## బదిలీపై వెళ్తున్న శోభారాణికి ఘన సత్కారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో సహాయ పరిపాలన అధికారిణిగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల ఉద్యోగోన్నతి పొంది విజయనగరం జిల్లా ఏపీఎస్పీ ఐదవ బెటాలియన్‌కు పరిపాలన అధికారిణిగా బదిలీపై వెళ్తున్న జి.సత్యశోభారాణిని జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనా విభాగం అధికారులు, సిబ్బంది సన్మానించారు. ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆమెకు దుశ్శాలవతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శోభారాణి కార్యాలయం పని వేళలో అందుబాటులో ఉంటూ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా పూర్తి చేసేవారని అన్నారు. సిబ్బంది అందరిని సమన్వయం చేసుకుంటూ, ఉత్తమ పనితీరు కనబర్చి, సమర్థవంతంగా పని చేసేవారని ఆమె సేవలను ఎస్పీ కొనియాడారు. ఇక్కడ వలే బదిలీపై వెళ్తున్న చోట కూడ మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత కార్యాలయ ఏవో సీహెచ్ గోపినాథ్, ఆఫీస్ సూపరింటెండెంట్లు కోటేశ్వరరావు, బాలరాజు, లిల్లీ బాయ్, సిబ్బంది పాల్గొన్నారు.



## 21న అసిరితల్లి విగ్రహ ప్రతిష్ఠ

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)



తమ్మినాయుడుపేటలో వెలసియున్న అసిరి తల్లి అమ్మవారి (గ్రామదేవత) విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఈ నెల 21న ఉదయం 8.23 గంటలకు తెన్నేటి విక్రమ్ ప్రకాశ శర్మ పర్యవేక్షణలో, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపాద సురేష్ శర్మ ఆధ్వర్యంలో ఆచార్య, బ్రహ్మ, రుత్విక్ పరివారంతో నిర్వహించనున్నట్లు అమ్మసంస్థాన్ ఆలయ శాశ్వత ధర్మకర్త సాగి శ్రీనివాసరాజు, ఉమాదేవి దంపతులు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 18న సాయంత్రం దేవతామూర్తుల తిరువీధి నిర్వహిస్తున్నామని, భక్తులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అలాగే 19న ఉదయం గణపతి పూజ, ప్రతిష్ఠ సంకల్పం, యాగశాల ప్రవేశం, సర్వదేవతా ఆవాహనం, సాయంత్రం 5 గంటలకు ఆవాహన దేవతావహనలు, నీరాజన, మంత్రపుష్పం తదితర పూజలు ఉంటాయన్నారు. 20న మంటప పునఃపూజలు, సూర్యనమస్కారాలు, మహాలింగార్చన, చండీసప్తశతీ పారాయణ, జలాధివాసం, క్షీరాధివాసం, సాయంత్రం 4 గంటలకు ధాన్యాధివాసం, హోమాలు, పుష్పశయ్యాదివాసం, వేదస్వస్తి, నీరాజన, మంత్రపుష్పములు తదితర ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు రాజు తెలిపారు.

ఈ నెల 21న సోమవారం ఉదయం ప్రాతః కాలార్చన, కళాహోమం, గర్తన్యాసం, బీజన్యాసం, యంత్ర, మూర్తి, శిఖర ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదే రోజు మధ్యాహ్నం మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు రాజు, ఉమాదేవి దంపతులు ఆ ప్రకటనలో తెలిపారు.

## కొత్తూరులో పల్లెపండుగ

(సత్యంన్యూస్, కొత్తూరు)

ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో మౌలిక సదుపాయాలు పెద్దఎత్తున కల్పించేందుకు మునుపెన్నడూ జరగని విధంగా గ్రామ పంచాయతీల అభివృద్ధికీ వారం రోజులపాటు నిర్వహిస్తున్న పల్లె పండుగ వారోత్సవాలను శుక్రవారం లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు కొత్తూరు మండలంలోని పొంటూరు, కుద్దిగాం, మాకవరం గ్రామాల్లో జరిపారు. బీటీ రోడ్డు నిర్మాణానికి తులసి వరప్రసాదరావు శంకుస్థాపన చేసి మాట్లాడుతూ నియోజకవర్గంలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, నీటి సంరక్షణ ట్రెంచులు, గోకులాలను పెద్దఎత్తున అన్ని గ్రామాల్లో నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి ఎద్దు సంతోష్‌కుమార్, ఎంపీటీసీ చీకటి వీర్రాజు, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## 20న రారవే 117వ సమావేశం

(సత్యంన్యూస్, రాజాం)

రాజాం రచయితల వేదిక సాహితీ సమావేశాన్ని ఈ నెల 20న ఉదయం 10 గంటలకు స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు రంగనాథం తెలిపారు. రౌతు గణపతిరావునాయుడు అధ్యక్షతన జరిగే ఈ 117వ సమావేశంలో 'వంశవృక్షం నవల – పరిశీలన' అనే అంశంపై పొదిలాపు శ్రీనివాసరావు ముఖ్య ప్రసంగం చేస్తారు. భాషాభిమానులు, సాహిత్యాభిమానులు, కవులు, రచయితలు, సాహిత్య పోషకులు అందరూ హాజరు కావాలని రంగనాథం కోరారు.

**పాస్‌పోర్ట్ పోయినది**

నా పేరు కొండ దినేష్ కుమార్ నా పాస్‌పోర్ట్ నెంబర్ : T2666408. నేను శ్రీకాకుళం నుంచి పొందూరు బస్సులో వెలుతుండగా నా బ్యాగ్ చిలకపాలెం జంక్షన్ దగ్గర పోయినది కావున దొరికిన వారు ఈ క్రింద చిరునామాకు తెలియజేయగలరు

K DINESH KUMAR
S/0 K SRINIVASA RAO, D.No.12-9-3-12
KAKI STREET, ZP ROAD, SRIKAKULAM -532001
PH NO : 8919684589


SriAaKaSa
YOUR TRUSTED PARTNER IN THE DISTANCE EDUCATION SECTOR.
Join our Earn while Learn program and get a job within 40 days after joining.
LAST DATE: AUGUST-28
91330 06999 Courses 92466 36411
10th, Intermediate
BA (all groups), B.Com, BLiSc, B.SC (all groups), BBA, BCA (with Market trending specialisations)
MA (all subjects), M. Com, MBA, MCA, M. SC (All Subjects), MLiSc, M.Tech
Computer Applications, Cyber Security. Digital Marketing. Hospital Management, Tourism Management

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

MNM
బెంగుళూర్ అయ్యంగార్ బేకరి
BSNL ఆఫీస్ ప్రక్కన, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
సెల్: 76759 18522

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

జై శ్రీమన్నారాయణ
శ్రీ క్రిష్ణ ఆన్‌లైన్ సర్వీసెస్
మావద్ద అన్ని రకముల జాబ్ అప్లికేషన్స్ ఆన్‌లైన్ చేయబడును.
సెల్: 93938 41308
రైల్వే రిజర్వేషన్లు, బస్ రిజర్వేషన్ సదుపాయం కలదు.

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE WOMEN'S COLLEGE ROAD, SRIKAKULAM - 532 001

## చెరువులు రాసిచ్చేశారోచ్!

(మొదటిపేజీ తరువాయి)

చెరువుగట్లు లీజుకు తీసుకున్న తోటయ్య గట్టు చదును చేయడానికి, మొక్కలు నాటడానికి రూ.లక్షల్లో ఖర్చు పెట్టాడని కొత్తవాదన గ్రామపెద్దల తెరపైకి తెచ్చారు. దీన్ని గ్రామంలో స్థానిక యువత ఆక్షేపిస్తున్నారు. చెరువుగట్లు లీజుకు ఇచ్చిన సమయంలో పెద్దలుగా చలామణి అవుతున్న 13 మందికి తప్ప మరొకరికి తెలియకుండా తతంగమంతా నడిపి ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసిన తర్వాత ఇప్పుడు రాజీ ప్రయత్నాలు చేస్తు న్నారని విమర్శిస్తున్నారు. గ్రామదేవత పండగల పేరు చెప్పి చెరువుగట్లు లీజకు ఇవ్వడాన్ని స్థానికులు తప్పు పడుతున్నారు. గ్రామంలో అనేక చోట్ల వివిధ పేర్లతో గ్రామ దేవతలు ఉన్నారని, అలాంటప్పుడు గ్రామదేవత పేరు చెప్పి ఎలా లీజుకు ఇస్తారని కొందరు ఎదురు తిరుగుతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.








# సర్పంచ్‌పై చర్యలు తీసుకోండి..!

**- కలెక్టర్‌ను కలిసిన ఇల్లాయిపురం ప్రజలు**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మెళియాపుట్టి మండలం ఇల్లాయిపురం పంచాయతీ సర్పంచ్ గౌరీష్ అవినీతిపరుడని, అతని తక్షణమే సర్పంచ్ పదవి నుంచి తొలగించాలని పంచాయతీ సభ్యులందరూ ఉపసర్పంచ్ అధ్యక్షతన ఏకగ్రీవంగా తీర్మానం చేసి కలెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోడు భూములకు పట్టాలిప్పిస్తామని 30 మంది నుంచి రూ.10వేల చొప్పున వసూలు చేశారని, గ్రీన్ అంబాసిడర్‌లో పనిచేస్తున్న కార్మికుల వద్ద హౌసింగ్ ఇప్పిస్తానని ఒక్కో కుటుంబం నుంచి రూ.5వేలు చొప్పున వసూలు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయడం లేదని, ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, అడిగే వార్డు సభ్యులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూ వినతిపత్రం అందజేశారు.

అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట నినాదాలు తెలిపారు. ఉప సర్పంచ్ సిహెచ్ లక్ష్మి, ఎం.జయమ్మ, వార్డు సభ్యులు జి.రామారావు, ఎన్.ప్రకాష్, జి.ప్రభ, చందర్రావు, గొడ్డు తలాబి తదితరులు పాల్గొన్నారు.

# బ్రెస్ట్ క్యాన్సర్ గుర్తింపులో మేమోగ్రామ్ కీలకం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బ్రెస్ట్‌క్యాన్సర్ గుర్తింపులో మేమోగ్రామ్ స్క్రీనింగ్ పరీక్ష కీలకమని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మేమోగ్రామ్ దినోత్సవం సందర్భంగా స్థానిక కాకినాడ ఆదిత్య కళాశాల కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ మేమోగ్రామ్ ప్రాముఖ్యతను విద్యార్థినులకు వివరించారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంటర్ సెంట్రల్ సెక్రటరీ డాక్టర్ పైడి సింధూర మాట్లాడుతూ 30 ఏళ్లు పైబడిన ప్రతి మహిళ బ్రెస్ట్ క్యాన్సర్ గుర్తింపునకు మేమోగ్రామ్ పరీక్షను ఏడాదికి ఒకసారి చేయించుకోవాలని సూచించారు. జిల్లా వినియోగదారుల సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ బుడుమూరు శ్రీరామమూర్తి మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు క్యాన్సర్ పెరుగుదలకు ప్రధాన కారణమన్నారు. కార్యక్రమంలో కళింగ గ్లోబల్ ఫెడరేషన్ అధ్యక్షులు బి.వి.ఎస్.ఎన్.రాజు, కాకినాడ ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్, కళాశాల సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.




# రోస్టర్ పాటింపుపై హర్షం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సమగ్ర శిక్ష అభియాన్ నోటిఫికేషన్‌లో రోస్టర్ పాటిస్తూ ఉత్తర్వులు విడుదల చేయడం పట్ల ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి హర్షం తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్‌కు సంబంధించి నోటిఫికేషన్ కోసం స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ గతంలో రూల్ ఆఫ్ రోస్టర్ పాటించలేదని, అందున ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందని, రాష్ట్రంలో 507 పోస్టులకు గాను ఆదివాసీలకు 30కి పైగా పోస్టులు కేటాయించాలని కోరారు. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల్లో రూల్ ఆఫ్ రోస్టర్ పాటించకపోవడంపై యోగి జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్, ఎస్టీ కమిషన్ సభ్యులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్‌కి నోటీసులు ఇవ్వడంతో సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ రోలా పోస్టర్ పాటిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వులపై యోగి హర్షం తెలుపుతూ ఆదివాసి జాతికి అన్యాయం జరిగినప్పుడు ఆదివాసి సంక్షేమ పరిషత్ పోరాటంలో ముందు వరుసలో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా జాతీయ ఆదివాసీ సంక్షేమ పరిషత్ తరపున ఎస్టీ కమిషన్ సభ్యులకు, హుస్సేన్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉన్నత విద్యామండలి సెక్రటరీగా కృష్ణమూర్తి

(సత్యంన్యూస్, అమరావతి)



ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి కార్యదర్శిగా టి.వి.ఎస్. కృష్ణమూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఉన్నత విద్యామండలిలో జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న కృష్ణమూర్తిని ప్రభుత్వం ఇన్‌ఛార్జి కార్యదర్శిగా నియమించింది. 2014 చంద్రబాబు ప్రభుత్వం హయాంలో కూడా కృష్ణమూర్తి సెక్రటరీ ఎఫ్.ఏ.సి.గా పని చేశారు. 2014 నుంచి 2016 వరకు ఆయన పనిచేసిన సమయంలో ఉన్నత విద్యామండలిలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రం విడిపోయిన సమయంలో ఏపీకి రావాల్సిన 58 శాతం వాటా విషయంలో సుప్రీంకోర్టులో కేసు నడిచింది. ఈ సమయంలో కృష్ణమూర్తి నిర్వహించిన పాత్ర ఎనలేనిది. సుప్రీంకోర్టు అడిగిన ప్రతి అంశాన్ని ఎఫ్ఏసీ కార్యదర్శి హోదాలో కృష్ణమూర్తి నిర్వహించిన పాత్ర వల్లనే 58 శాతం వాటా ఉన్నత విద్యామండలికి దక్కింది. రాష్ట్ర విభజన సమయంలో దీనస్థితిలో ఉన్న ఉన్నత విద్యామండలి నేడు వైభవంగా వెలుగొందుతుందంటే కృష్ణమూర్తి పాత్ర ఎంతో కీలకమైంది. గడిచిన ఐదేళ్లలో ఉన్నత విద్యామండలిని అప్పటి అధికార పార్టీ పూర్తిగా చెరిచేయడంతో ఇప్పుడు కృష్ణమూర్తి మీద గురుతర బాధ్యతలు ఉన్నాయి. రాష్ట్రంలో యూనివర్సిటీలన్నీ రాజకీయ నాయకులకు పునరావాస కేంద్రాలుగా మారిన సమయంలో వాటిని సంస్కరించాల్సిన కీలకమైన పదవిలో కృష్ణమూర్తిని ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఉన్నత విద్యామండలి సెక్రటరీగా బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబు, విద్యాశాఖామంత్రి నారా లోకేష్, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోనా శశిధర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఉన్నత విద్యామండలి ఔన్నత్యాన్ని కాపాడతానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.


**అద్దెకొరకు**

శ్రీకాకుళంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద గల లయా ల్యాబ్ బిల్డింగ్‌లోని సెకండ్ ఫ్లోర్, థర్డ్ ఫ్లోర్ (22X150) కామన్ హాల్ మెడికల్ హోల్‌సేల్ షాపులకు గాని, డాక్టర్ ప్లాజాకు గాని, ఆఫీసులకు గాని అద్దెకు ఇవ్వబడును.


- సంప్రదించగలరు -

**94403 72300, 98487 96626**


# రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాజమండ్రిలో ఈ నెల 19, 20 తేదీల్లో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు శ్రీకాకుళం జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో శ్రీకాకుళం న్యూ సెంట్రల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి శిష్టు లక్ష్మీచేతన్, అండర్-14 విభాగంలో నగరంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూలుకు చెందిన 7వ తరగతి విద్యార్థి మల్లారెడ్డి త్రిలోచన్ వెంకటసాయిప్రసాద్‌లు రాజమండ్రిలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో జరగనున్న పోటీలకు హాజరు కానున్నారు. చిత్తరంజన్ వీధిలోని, పిల్లల లక్ష్మణమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాతృదేవో భవ రైఫిల్ షూటింగ్ ఇన్‌స్టిట్యూట్‌కి చెందిన విద్యార్థులిద్దరూ ఈ పోటీలకు ఎంపిక కావడం పట్ల శిక్షకుడు పిల్లల తిరుమల హరీష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో రైఫిల్, పిస్టల్ షూటింగ్‌కు ఇప్పుడిప్పుడే ఆదరణ కనిపిస్తోందని ఆయన చెప్పారు. భారత రక్షణ రంగంలోని నేవి, ఎయిర్ ఫోర్స్, కోస్ట్‌గార్డు, ఇంకా అనేక ప్రభుత్వ ఉద్యోగాల్లో షూటింగ్‌లో పతకాలు సాధించిన విద్యార్థులకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని ఆయన అన్నారు. జిల్లా నుంచి జాతీయ స్థాయి వరకు గత పదేళ్లలో ఎంతోమంది వివిధ స్థాయి పోటీలకు వెళ్లారని హరీష్‌కుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. రైఫిల్ పోటీలకు వెళ్లనున్న చేతన్, త్రిలోచన్‌లను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, న్యూసెంటర్ స్కూల్ ప్రిన్సిపాల్ బలివాడ మల్లేశ్వరరావు, డైరెక్టర్ పి.శ్రీకాంత్, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ కరస్పాండెంట్ రమేష్ తదితరులు అభినందించారు. భవిష్యత్తులో రైఫిల్ షూటింగ్‌లో జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.




'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి

**8019 221 221**


## సమస్యలుంటే నేరుగా సంప్రదించండి: ఎస్పీ



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

పోలీసు సిబ్బంది వ్యక్తిగత, ఆరోగ్య, ఉద్యోగరీత్యా సమస్యలుంటే ప్రతి ఒక్కరు నిర్భయంగా నేరుగా సంప్రదించాలని, ఆయా సమస్యలపై సాధ్యాసాధ్యాలను బట్టి పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు మైదానంలోని పోలీస్ కమ్యూనిటీ హాల్లో జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బందికి ప్రత్యేకంగా పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని శుక్రవారం ఎస్పీ నిర్వహించారు. ఈ క్రమంలో పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పోలీసు సిబ్బంది సమస్యలపై నిర్వహించిన గ్రీవెన్స్‌లో సిబ్బంది ఉద్యోగ, వ్యక్తిగత, అనారోగ్య సమస్యలను ఎస్పీకి తెలిపారు. వారి వినతులను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించి, సానుకూలంగా స్పందించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతిఒక్కరు క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, మానసిక, శారీరకంగా దృఢంగా ఉండి ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్ఐ కె.నర్సింగరావు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మడ్డువలసను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

(సత్యంన్యూస్, రాజాం)

మడ్డువలస రిజర్వాయర్ పరిసరాలు చాలా ఆహ్లాదకరంగా ఉన్నందున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ బోర్డు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలసిన అవసరం ఉందని జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి పిసిని చంద్రమోహన్ అన్నారు. శుక్రవారం మడ్డువలస రిజర్వాయర్ నీటి ప్రవాహం, వాటి పరిసర ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మడ్డువలస రిజర్వాయర్ పనులు ఆధునీకరణతోనే రైతంగానికి రెండు, మూడు పంటలకు సాగునీరును అందించగలమన్నారు. డ్యాంలో పేరుకుపోయిన ముళ్లతుప్పలను తొలగించినట్లయితే ఉపశమనం ఉంటుందని జిల్లా ఇరిగేషన్ అధికార్లకు సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా నాయకులు వాడాడ సురేష్‌కుమార్, ముంగి జగదీశ్, వంగర మండల జనసేన నాయకులు యలకల శ్రీనివాసరావు తదితరులున్నారు.



# సాక్షి ఎడిటర్‌పై కేసు అన్యాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తే, ప్రసారం చేస్తే మీడియా ప్రతినిధులపై పోలీస్ కేసులో నమోదు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు విమర్శించారు. కొన్ని చానళ్లను ప్రసారం చేయవద్దని కేబుల్ ఆపరేటర్లపై ఒత్తిడి చేయడం, అధికారం ప్రయోగించి ప్రసారాలను నిలుపు చేయడం, ప్రభుత్వ నిర్ణయాలు వ్యతిరేకిస్తూ వార్తలు రాస్తే, ఎడిటర్లపై, ఇతర జర్నలిస్టులపై పోలీసు కేసులు బనాయించడం రాజ్యాంగం ప్రసాదించిన భావ స్వేచ్ఛకు విరుద్ధమని ఆయన అన్నారు. సాక్షి పత్రికలో వచ్చిన కథనం ఆధారంగా, పత్రిక ఎడిటర్, ఇతర జర్నలిస్టులపై విజయవాడ పోలీసులు కేసు నమోదు చేయడాన్ని ఐజేయూ తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఒక కథనం రాసిన జర్నలిస్టులపై గత నెలలో అక్కడ పోలీసులు కేసు నమోదు చేయగా, ఈ నెల నాలుగో తేదీన సుప్రీంకోర్టు ఈ కేసును కొట్టివేసిందని ధర్మారావు గుర్తుచేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1)( ఎ) ప్రకారం జర్నలిస్టులకు గల భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినట్టు ఆయన తెలిపారు. జర్నలిస్ట్ రాసినవి కేవలం ప్రభుత్వాన్ని విమర్శించేలా ఉన్నయనే కారణంతో క్రిమినల్ కేసులు పెట్టవద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసినట్టు తెలిపారు. గతంలోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని చట్టాలు, ఇతర నిబంధనల పేరుతో, అధికార బలంతో మీడియా గొంతు నొక్కే ప్రయత్నాలు చేసినా, ప్రజాస్వామిక శక్తుల పోరాటం వల్ల అవి విఫలమైనట్టు ప్రస్తుత కూటమి ప్రభుత్వం గుర్తించాలని కోరారు. మీడియా పట్ల అణచివేసే ధోరణిని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్.ఈశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, చింతాడ అప్పలనాయుడు, స్వామ్నా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంవీ మల్లేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సింగూరు శ్రీనివాస్, చిన్నారావు, గరిమెళ్ల ప్రెస్‌క్లబ్ కార్యదర్శి ఎస్.నవచైతన్య, కోశాధికారి చౌదరి సత్యనారాయణ తదితరులు ఖండించారు.

## బెదిరింపు కాల్స్‌పై ఎస్పీ గ్రీవెన్స్‌కు ఫిర్యాదు

(సత్యంన్యూస్, పలాస)

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై, జనసేన పార్టీ పలాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ దుర్గారావుకు ఆకతాయిల బెదిరింపు ఫోన్‌కాల్స్‌కి సంబంధించి ఇప్పటికే మూడు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఎస్పీ గ్రీవెన్స్‌కి స్వయంగా 150మంది జనసేన నాయకులు, జనసైనికులు వెళ్లి ఫిర్యాదు చేశారు. పలాసను ప్రశాంతంగా ఉంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఎస్పీని కోరారు. పలాసలో జరుగుతున్న రౌడీయిజాన్ని అరికట్టి, మున్ముందు ఎటువంటి దౌర్జన్యపు సంఘటన జరగకుండా చూడాలని కోరారు.




## మహిళల సంక్షేమమే బాబు ధ్యేయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

మహిళా సంఘాల ఐక్యత, సంక్షేమమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయమని, మొదటిసారి ముఖ్యమంత్రి అయిన వెంటనే డ్వాక్రా సంఘాల ఏర్పాటు ద్వారా మహిళల ఆర్థిక అభివృద్ధికి బీజం వేసారని నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ అన్నారు. శుక్రవారం 29వ డివిజన్ పరిధిలో సమాఖ్యకు సంబంధించిన డ్వాక్రా సంఘాల వార్షిక మహాజన సభ స్థానిక పాత హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మొదటి నుండి మహిళలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని, వారి గౌరవం కాపాడాలనే ఉద్దేశంతో పని చేసేదని గుర్తుచేశారు. చంద్రబాబు మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడే మహిళా ఆర్థికాభివృద్ధిపై దృష్టి పెట్టి డ్వాక్రా సంఘాలు నెలకొల్పి ఆర్థిక భరోసా కల్పించారని తెలిపారు. అనంతరం సంఘ అధ్యక్షులుగా డి.యశోదర, ఉపాధ్యక్షులుగా సరోజినీ, సెక్రటరీ రోహిణి, జాయింట్ సెక్రటరీ, సుజాత, ట్రెజరర్‌గా స్వాతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 29వ డివిజన్ ముఖ్య నేతలు, నగర తెలుగుదేశం పార్టీ కోశాధికారి పట్నాయకుని సతీష్ బాబా, దారపు సాయిరాజ్, డివిజన్ యువత చిన్ని, రాము, సంతోష్, మణి, బంగార్రాజు, సీఎల్ఆర్‌పీ, పి,జ్యోతి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.